"అందుకే చేసుకోవాలంటున్నాను. అన్నయ్య చనిపోయే ముందు, చేతిలో చెయ్యి వేసి వాగ్దానం చేశాను, నజ్మాను నా కోడలిగా చేసుకుంటానని."

"డాడీ! అలాంటి రక్త సంబంధాలు మంచివి కావు."

"మంచివి కావా? మీ అమ్మ నాకేమవుతుందో తెలుసా? స్వంత బాబాయి కూతురు. మాకేమయింది? మన మతంలో ఇలాంటివి ఆదినించీ జరుగుతూనే వున్నాయి. ఏమైందనీ?"

"సైంటిఫిక్‌గా మంచిది కాదనీ..."

"ఎవరా అన్నది?... ఏ కాఫిర్ స్నేహితులే కదూ?"

"డాడీ!"

"ఏం, అలా ఉలిక్కిపడతావేం? కాఫిర్ అంటే తిట్టుకాదు. ఇస్లాం మతంలో నమ్మకంలేని వాళ్ళనందర్నీ మనం కాఫీర్లంటాం, అంతే .. నాకు తెలుసు. నీకు హిందూ స్నేహితులున్నారని. నాకూ ఉన్నారు. అందులో తప్పులేదు. మనం భారతదేశంలో ఉంటున్నాము. అందరితోనూ కలిసి మెలిసి ఉండాలి. కాని ఎవరిసాంప్రదాయాలు వారు పాటించాలి. పోనీ, నీ ఆ హిందూ స్నేహితుల్ని ఒక మాట అడుగు."

ఏమన్నట్టు చూశాడు ఇమ్రాన్.

"వాళ్ళు మేనమామ కూతుర్ని ఎందుకు పెళ్ళి చేసుకుంటారట?"

అంతవరకూ మౌనంగా భోంచేస్తున్న బేగం "నిజంగానా?" అంది.

"మేనమామ కూతుర్నే కాదు, అక్కయ్య కూతుర్ని కూడా చేసుకుంటారు. అవి రక్త సంబంధాలుకావా? వాళ్ళ కేమవుతోందని?... ఇలాంటి పిచ్చి పిచ్చి వూహలు వూహించక నేను చెప్పినట్టు చెయ్యి. వెంటనే నజ్మాను పెళ్ళిచేసుకో. ఇష్టమైతే కలిసే అమెరికా వెళ్ళండి. కావలిసిన డబ్బంతా నేను సర్దుతాను."

ఇమ్రాన్ చేతులు కడుక్కొని, వచ్చి డైనింగ్ టేబులు మీద ఆబిదాకు ఎదురుగా కూచున్నాడు, ఆబిదాకేసే చూస్తూ.

"ఉఁ, తిను-ఇవ్వాళ్ళ వంటకాలు ఎలా ఉన్నాయో చెప్పాలి. వంటవాడు కొత్తగా వచ్చాడు" అన్నది ఆబిదా,

"ఆంటీ! నన్నెందుకిలా వేధిస్తావు? వజ్మా గురించి తెలుసుకోవాలని నా మనసెంత తహ తహ లాడుతూందో తెలీదా?"

"తెలుసు, కాని నువ్వింకా చిన్నపిల్లవాడిలాగే ఉండి పోయావనిపిస్తు. యు ఆర్ ఎ గ్రోనప్ మాన్ నౌ, మై బాయ్! బి బ్రేవ్"

"అందే... వజ్మా వజ్మా..." కంఠం రుద్ధ పడిపోయింది.

"అరె, అదేమిటి, అలా బెంబేలు పడి పోతావేం?"

"మరి, వజ్మా... బ్రతకదన్నావు?"

"ఛ ఛ! అవేం పాడు మాటలు? ఎవరన్నారు వజ్మా బ్రతకదని?"

ఒక్కసారి ఆశగా, "బ్రతుకుతుందా? నిజంగా బ్రతుకుతుందా ఆంటీ?" అంటూలేచి ఆబిదా దగ్గరికెళ్ళాడు.

"కూచో కూచో. వజ్మా బ్రతుకుతుంది, తప్పకుండా బ్రతికే ఉంటుంది, ఆ హామీ నేనిస్తాను. నువ్వు నిదానంగా కూచుని భోంచెయ్యి, నన్నూ చెయ్యనీయ్."

ఇమ్రాన్ మారు మాట్లాడకుండా వెళ్ళి కూచున్నాడు. అయిష్టంగానే రొట్టెముక్క నోటిలో పెట్టుకున్నాడు.

ఇంతలోకి ఇస్లాంఖాన్, బేగంవచ్చారు. డ్రాయింగ్ రూంలో కూచున్నారు. ఆబిదా భోజనం ముగించి లేచింది. ఇమ్రాన్ తినీ తిననట్టు తిని లేచాడు. ఇద్దరూ డ్రాయింగ్ రూంలోకెళ్ళి కూచున్నారు.

"చెప్పండి డాక్టర్! ఇవ్వాళేం జరిగింది? డాక్టర్ దేశాయ్ ఏం తేల్చారు?" ఖాన్ అడిగాడు.

ప్రతి నమస్కారం చేసి, తలనిండా ముసుగు లేసుకుని, ఇంకొంచెం ఒదిగి కూచుంది నజ్మాతల్లి.

ఎదురుగా ఉన్న మరో బల్ల మీద ఆసీనుడైనాడు ఖాన్. కూచోగానే, "నజ్మా కులాసాయేనా వదినా?" అని అడిగాడు.

"ఫరవాలేదు. ఇప్పుడిప్పుడే ఫోంచేస్తూంది."

"ఇమ్రాన్ అక్కడే ఉంటున్నాడా?"

"ఆ... మీకు తెలీదా?"

"ఏదీ, వాడీ మధ్య కనిపించటమే లేదు... ఇప్పుడు ఇంట్లోనే ఉన్నాడా?"

"లేదు, ఎటో వెళ్ళాడు."

"ఊఁ. తిరిగి అమెరికా వెళ్ళిపోతూన్నాట్టగా?"

"... అవును . వెళ్తున్నారు" అన్నది, ఇద్దరూ వెళ్తున్నారు అని స్ఫురించేట్టు.

అది గమనించనట్టుగానే, "ఎప్పుడు?" అని అడిగాడు.

"ఎప్పుడు సీట్లు దొరికితే అప్పుడు వెళ్తారట."

ఇద్దరూ మౌనం వహించారు. బేగం వక్కలు కత్తిరిస్తూనే ఉంది.

కాసేపాగి మళ్ళీ అందుకున్నాడు ఖాన్, "చూడండి వదినా! ఇప్పుడు మిమ్మల్ని ఎందుకు పిలిపించానంటే... మన కుటుంబంలో మిగిలిన వాళ్ళల్లో అందరి కంటే పెద్దవారు మీరే. ఏ సమస్య వచ్చినా మీతోనే చెప్పుకోవాలి. . కాబట్టి నేను చెప్పేది కాస్త సావధానంగా వినాలి" అని ఆగిపోయాడు.

ఇదంతా దేనికి ఉపోద్ఘాతమో అంతు పట్టలేదు నజ్మాతల్లికి.

"మా నాన్నగారికి అన్నయ్యా, నేనూ ఇద్దరమే సంతానం. అన్నయ్యకు నజ్మా ఒక్కర్తే సంతానం, నాకు ఇమ్రూ ఒక్కడే. మనం వేరువేరు

ఇండ్లల్లో ఉంటున్నా మనది ఒకే కుటుంబం. అందుకే మన వంశాభివృద్ధి కోసం పరాయి వాళ్ళ జోలి లేకుండా, ఇమ్రూకు బొత్తిగా ఇష్టం లేకున్నా నేనే బలవంతాన ఇమ్రూకు నజ్మాను పెళ్ళి జరిపించాను. కాని ఖర్మం చాలక, పాపం! నజ్మా పేటికి ఇక సంతానం కలిగే యోగ్యత లేకుండా పోయింది. అంతా అల్లా ఇచ్ఛ! మన చేతుల్లో ఏముంది గనుక?... కాని... కాని .. మన వంశం ఇంతటితో ఆగి పోకూడదుగా?... ఏమంటారు వదినా?"

ఏమనాలో తోచలేదు నజ్మాతల్లికి. కూతురి దుర్గతి జ్ఞాపకం చెయ్యగానే దుఃఖం పొంగుకొచ్చింది. కొంగుతో కళ్ళొత్తు కుంటూ కూచుంది.

"చెప్పండి వదినా!... ఏం చేద్దామంటారు?" రెట్టించాడు ఖాన్.

విధిలేక నోరు కదిపింది, "నన్నేం చెప్పమంటారు?... మీరే చెప్పండి."

"... మన వంశం నిరవధికంగా సాగి పోవాలంటే నాకు తోచిందల్లా ఒక్కటే - మీకు అభ్యంతరం లేకపోతే అదే చేద్దాం."

"ఏమిటది!" అన్నట్టు తలెత్తింది.

ఖాన్ తలదించుకుని, "ఇమ్రూకు ఇంకో పెళ్ళి చేద్దాం" అన్నాడు.

నజ్మాతల్లి షాక్ తిన్నట్లు అదిరి పడ్డది. దుఃఖం కట్టలు తెగింది. బాహాటంగానే కన్నీళ్ళు కారుస్తూ వెక్కటం మొదలెట్టింది. బేగం ఆమె భుజం చుట్టూ చేతులు వేసి, "ఫూరోక్కు అక్కా! ఫూరోక్కు" అంటూ ఓదార్చింది.

ఖాన్ చెప్పుకు పోయాడు, "మీరిలా బెంబేలు పడిపోతే ఎలా?... ఉన్న సమస్యకాస్తా, మీరు పెద్దలు, మీ ముందుంచాను. మీరే నిర్ణయించాలి."

ఆమె వెక్కుతూనే, "కాని కాని నజ్మా...?" అనగలిగింది.

"నజ్మాకేం? నజ్మా మాత్రం మా కూతురు కాదూ? దానికి అన్యాయం చేస్తామా?... ఆ వచ్చే రెండో భార్య కేవలం సంతానార్థమే. నజ్మా

